## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మందమర్రి సీఐకి ట్రోఫీ అందజేస్తున్న ఏసీపీ రవికుమార్

మందమర్రి, మార్చి 9 : నేటి యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యంగా ఎదగాలని బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ సూచించారు. మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో ఆదివారం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా యువతలో అవగాహన పెంచేందుకు యాంటి డ్రగ్స్ అవేర్‌నెస్ పేరిట నిర్వహించిన ప్రెస్ అండ్ పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఈ పోటీలు మధ్యాహ్నం 12 గంటల వరకు హోరాహోరీగా సాగాయి. ప్రెస్ జట్టుపై పోలీస్ జట్టు విజయం సాధించింది. పోలీస్ జట్టు తరుపున మందమర్రి సీఐ శశీధర్ రెడ్డికి ట్రోఫీని, ప్రెస్ జట్టు తరపున రన్నర్ ట్రోఫీని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గాండ్ల సంజీవ్‌కు ఏసీపీ రవి కుమార్ అందజేశారు. అద్భుత ప్రదర్శన కనబరచిన పట్టణ ఎస్ఐ రాజశేఖర్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ప్రకటించారు. క్రీడలు యువతను నేరాల నుంచి దూరంగా ఉంచేందుకు మార్గదర్శకాలుగా తోడ్పడుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

## విద్యతోపాటు క్రీడలూ అవసరమే

**మాదారం ఎస్ఐ సౌజన్య**

తాండూర్, మార్చి 9 : విద్యతోపాటు, బాలలకు క్రీడలూ ఎంతో అవసరమని మాదారం ఎస్ఐ సౌజన్య అన్నారు. తాండూర్ ఐబీలోని శ్రీ వాణిని కేతన్ పాఠశాలలో కుమార్ బ్రదర్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జూనియర్ చెస్ చాంపియన్ షిప్ పోటీలకు ఎస్ఐ సౌజన్య ముఖ్య అతిథిగా హాజరై, బహుమతులు ప్రధానం చేశారు. క్రీడలతో మానసిక వికాసం కలుగుతుందన్నారు. పాఠశాల యాజమాన్యం, కుమార్ బ్రదర్స్ ఆధ్వర్యంలో చెస్ పోటీలను నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఎం ప్రహర్ష (ప్రథమ), దేవాన్స్ (ద్వితీయ), హరిచరణ్ (తృతీయ)తో పాటు, కేటగిరీల ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చెస్ ఆర్బిటర్ సమ్మయ్య, ప్రన్సిపాల్ కవిత, కరస్పాండెంట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సాయం

చెన్నూర్ రూరల్, మార్చి 9 : చెన్నూర్ మండలం అక్కెపల్లి గ్రామంలో కోర్తె సుధాకర్‌కు చెందిన ఇల్లు అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. కాగా, విషయం తెలుసుకున్న చెన్నూర్ లయన్స్ క్లబ్ భాదితులకు అండగా నిలిచారు. క్వింటాలు బియ్యం, దుప్పట్లు, నిత్యావసర సరుకులు అందచేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చెన్నూర్ అధ్యక్షుడు జాడి తిరుపతి, సభ్యులు మద్ది కార్తిక్, సొడం శ్రీనివాస్, రత్న ప్రభాకర్ రెడ్డి, గెడిసెల సంపత్ రెడ్డి, రాపర్తి శ్యాం సుందర్, చకిరారపు హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి, మార్చి 9 : కోటపల్లి మండలం పారిపెల్లి గ్రామానికి చెందిన రాదండి రాజేశ్ మహాశివరాత్రి రోజున గోదావరి స్నానానికి వెళ్లి, ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని లయన్స్ క్లబ్ చెన్నూర్ అధ్యక్షుడు జాడి తిరుపతి, క్లబ్ సభ్యులు పరామర్శించారు. క్వింటాలు బియ్యం తో పాటు, నిత్యావసర సరుకులు బాధిత కుటుంబానికి అందజేశారు. క్లబ్ సభ్యులు సల్లూరి శంకర్, సిరంగి సంపత్, గొడిసెల సంపత్ రెడ్డి, తుమ్మ శ్రీపాల్ అడ్వకేట్ కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## బియ్యం లారీ దొంగల అరెస్ట్

మంచిర్యాల అర్బన్, మార్చి 9 : ఏసీసీ ఏరియాలో గల సురభి లాడ్జి ఎదుట ఈ నెల 1న పార్కింగ్ చేసి ఉన్న బియ్యం లారీని ఎత్తుకెళ్లిన కాసిపేటకు చెందిన దావనపల్లి వెంకటేశ్, మందమర్రికి చెందిన తనగలపెల్లి రమేశ్, హాజీపూర్‌కు చెందిన వానరాసి సంపత్‌ను అరెస్ట్ చేసినట్లు ఏసీపీ ప్రకాశ్ తెలిపారు. 2న అగ్గ దేవారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించగా, దామనపల్లి వెంకటేశ్ ఎఫ్‌సీఐ గోదాంలో పనిచేస్తున్నపుడు పీడీఎస్ బియ్యం కొనే హాజీపూర్‌కు చెందిన వారణాసి సంపత్‌తో పరిచయమయ్యాడు. ప్రస్తుతం వెంకటేశ్, రమేశ్ లారీ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఎఫ్‌సీఐ గోదాం బయట నిలిపి ఉంచిన బియ్యం లోడుతో ఉన్న లారీని దొంగిలించాలని నిర్ణయించుకున్నారు. రెక్కి నిర్వహించి, 1వ తేదీ అర్ధరాత్రి లోడుతో ఉన్న లారీని దొంగిలించి, హాజీపూర్ వెళ్లారు. అక్కడ సంపత్‌కు బియ్యం విక్రయించారు. అనంతరం లారీని జగిత్యాల వైపు వెళ్లి, నిర్మానుష్య ప్రదేశంలో పార్క్ చేశారు. దానిని కొనేవాళ్లకోసం ప్రయత్నం చేశారు. ఎవరూ దొరక్కపోవడంతో ఆదివారం మంచిర్యాల మీదుగా మహారాష్ట్ర వెళ్లే క్రమంలో పోలీసులు పట్టుకున్నారు. వారిని పట్టుకొని విచారించగా, తప్పు ఒప్పుకున్నారని ఏసీపీ తెలిపారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. చాక చక్యంగా వ్యవహరించిన మంచిర్యాల ఎస్ఐ ప్రమోద్‌రావు, ఏస్ఐలు ప్రవీణ్, కిరణ్, క్రైమ్ సిబ్బంది ఉపేందర్, మహేశ్, లక్ష్మణ్, సుబ్బారావును ఏసీపీ అభినందించారు.

## అట్టహాసంగా ఫేర్‌వెల్ వేడుకలు

కౌటాల, మార్చి 9 : కౌటాల మండల కేంద్రంలోని మయూరి విద్యాలయంలో పదోతరగతి విద్యార్థులకు ఆదివారం ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. కరస్పాండెంట్ శాగంటి యాదగిరి, ప్రిన్సిపాల్ సంతోష్ ఆధ్వర్యంలో విద్యార్థులు పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పదోతరగతి విద్యార్థులు పాఠశాలలో వారి అనుభవాలను తెలిపారు. విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి, ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కరస్పాండెంట్ సూచించారు. విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## యూనియన్ బలోపేతానికి కృషి చేయాలి

సీసీసీ నస్పూర్, మార్చి 9 : యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, వేజ్‌బోర్డు సభ్యుడు రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య అధ్యక్షతన ఆదివారం సీసీసీ నస్పూర్‌లో యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. రియాజ్ అహ్మద్ ముఖ్యాతిథిగా హాజరై, మాట్లాడారు. నాయకులు జక్కుల నారాయణ, పల్లె క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం శ్రీరాంపూర్ బ్రాంచ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా అనిల్‌రెడ్డి, కార్యదర్శిగా పొన్నగంటి అశోక్, కోశాధికారిగా మీస కొమురయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దుర్గం లక్ష్మణ్, యూత్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కంకణాల రంజిత్‌కుమార్, 10 మందిని సహాయ కార్యదర్శులుగా, 20మందిని ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా, కమిటీ సభ్యులు, ఎగ్జిక్యూటీవ్ సభ్యులు ఎన్నికయ్యారు. బ్రాంచ్ కార్యదర్శిగా పనిచేసిన తిప్పారపు సారయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, కంబాల నరసయ్య, దుర్గం వెంకటేశ్వర్లును సెంట్రల్ కమిటీలోకి తీసుకున్నారు.

## ఉద్యమాలు జయప్రదం చేయండి


కాగజ్‌నగర్, మార్చి 9 : మహిళలు సమానత్వం దోపిడీ విముక్తి కోసం ఉద్యమాలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాదవి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కాగజ్‌నగర్ పట్టణంలోని బాల భారతి హైస్కూల్‌లో రాజేశ్వరి అధ్యక్షతన మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మహిళా చట్టాలు పకడ్బందీగా అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయాయయని ఆరోపించారు. మూడింట ఒకవంతు మంది మహిళలు గృహ హింసకు గురవుతున్నారని అనేక గణాంకాలు తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి జిల్లాకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి, మహిళలకు భద్రత, భరోసా కల్పించాలన్నారు. సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు ముంజం శ్రీనివాస్ రాజేందర్, మోరేశ్వర్, శ్రీకాంత్, అంకయ్య, శంకర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ త్రివేణి, రోజా, పద్మ, శారద, వినోద, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మహాసభకు తరలిన నాయకులు

జైపూర్, మార్చి 9 : హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన పద్మశాలి సంఘం మహాసభలకు మండలం నుంచి నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. వారిలో పద్మశాలి సంఘం మండలాధ్యక్షుడు వేముల మల్లేశ్, మాజీ సర్పంచ్ ఆవిడపు గణేశ్, కుల సంఘం నాయకులు ఉన్నారు.

# చేతులెత్తేసిన జిన్నింగ్ యజమానులు

- నిలిచిపోనున్న పత్తి కొనుగోళ్లు
- కష్టాల్లో పత్తి రైతులు



రైతు సోదరులకు ముఖ్య గమనిక.

సమస్త రైతు సోదరులకు తెలియజేయునది ఏమనగా వరలక్ష్మి ఇండస్ట్రీస్ నందు పత్తి గింజలు నిల్వలు, లేబర్ సమస్య మరియు జిన్నింగ్ సమస్య వలన పత్తి కొనుగోలు తాత్కాలికంగా నిలిపివేయడమైనది.

ఇట్టి విషయంని రైతు సోదరులు గమనించి సహకరించగలరు

ఇట్లు
వరలక్ష్మి ఇండస్ట్రీస్

పత్తి కొనుగోళ్లు నిలిపి వేస్తున్నట్లు జిన్నింగ్ మిల్లు నుంచి జారీ చేసిన ప్రకటన

చెన్నూర్, మార్చి 9 : పత్తి పంట చేతికందినప్పటి నుంచి అమ్ముకునేందుకు పత్తి రైతులు నానా కష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందించేందుకు చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయి. రైతులకు పత్తి నవంబర్ నెలలో చేతికందింది. అప్పటి నుంచి కొనుగోళ్లు ప్రారంభించినప్పటికీ రైతులకు అవస్థలు తప్పడంలేదు. చెన్నూర్ పట్టణ పరిసరాల్లోని ఐదు జిన్నింగ్ మిల్లుల ద్వారా సీసీఐ కొనుగోళ్లు చేస్తున్నది. ప్రక్రియ ప్రారంభించినప్పటి నుంచి వరసగా ఒక్కసారి కూడా నెల రోజులు కొనుగోళ్లు చేయలేదు. వారం పాటు కొనుగోలు చేసి, మరో 15 రోజుల పాటు నిలిపివేస్తూ వస్తున్నది. అలాగే ఇరువై రోజుల క్రితం సీసీఐ కొనుగోళ్లు చేస్తున్నామని ప్రకటించడంతో రైతులు పెద్ద సంఖ్యలో వాహనాల్లో పత్తిని జిన్నింగ్ మిల్లుల వద్దకు తీసుకువచ్చారు. ఆ తర్వాత ఆన్‌లైన్ పనిచేయడం లేదని సుమారు 12 రోజులు పాటు, కొనుగోళ్లు నిలిపివేశారు. అప్పటి వరకు వాహనాలను మిల్లుల వద్ద క్యూలైన్‌లో ఉంచాల్సి వచ్చింది. దీంతో రైతులు వాహనాలకు అదనంగా వెయిటింగ్ చార్జీలు చెల్లించాల్సి వచ్చింది. కొంత మంది రైతులు వారం చూసి ప్రైవేటు దళారులకు అమ్ముకున్నారు. సీసీఐ సక్రమంగా పత్తి కొనుగోళ్లు చేపట్టకపోవడంతో ఇంకా రైతుల వద్ద సగం కంటే ఎక్కువగా పత్తి నిల్వలున్నాయి. అయితే ఉన్నట్టుండి జిన్నింగ్ మిల్లుల్లో పత్తి, పత్తి గింజలు నిల్వలు పేరుకపోయాయని, స్థలం లేదని, లేబర్ సమస్య కారణంగా జిన్నింగ్ చేయలేకపోతున్నామని, కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు పలువురు జిన్నింగ్ మిల్లుల యజమానులు ప్రకటన జారీ చేశారు. ఆ ప్రకటనతో పత్తి నిల్వలు ఉన్న రైతులు ఆందోళన చెందుతున్నారు. జిన్నింగ్ మిల్లుల్లో జిన్నింగ్ చేసే అవకాశంలేకపోతే సీసీఐ పత్తి కొనుగోళ్లు చేయలేరు. అప్పుడు దళారులకే పత్తి అమ్ముకోవాల్సి వస్తుంది. అయితే తాము పండించిన పత్తి అమ్ముకోవడం ఇప్పటికే ఆలస్యమవడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులుపడుతున్నారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని దళారులు తమ ఇష్టం వచ్చిన ధరకు పత్తి కొనుగోళ్లను చేస్తున్నారు. దీంతో పత్తి రైతు ప్రతి క్వింటాలుకు రూ 600 నుండి రూ 700వరకు నష్టపోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, రైతుల వద్ద పత్తి నిల్వలు అయిపోయే వరకు సీసీఐ నిరంతరంగా కొనుగోలు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## డబ్బు వసూలు చేస్తున్న వ్యక్తుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాశ్

సీసీసీ నస్పూర్, మార్చి 9 : బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న సీసీసీ నస్పూర్‌కు చెందిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంచిర్యాల ఏసీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ ప్రకాశ్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సీసీసీ నస్పూర్‌కు చెందిన ఎండీ నహీం పాషా ఆమ్ ఆద్మీ పార్టీ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. కొద్దిరోజులు రిపోర్టర్‌గా పనిచేశాడు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి పోటీ చేసి ఆర్థికంగా నష్టపోయాడు. కుటుంబ పోషణ ఇబ్బందిగా మారడంతో సులువుగా డబ్బు సంపాధించాలనుకొని తన స్నేహితులైన నల్ల నాగేంద్రప్రసాద్, కొంటు రాజేందర్‌తో కలిసి ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్‌లో సమస్యలు తలెత్తితే వాటిని పరిష్కరిస్తామని చెప్పి, డబ్బు తీసుకునేవారు. అనుమతికి మించి ఎవరైనా వస్తువులు తమ షాపుల్లో అమ్మితే ఆసరాగా చేసుకొని బెదిరింపులకు పాల్పడేవారు. ఆర్టీఐ యాక్ట్ ద్వారా సమాచారం కోరుతూ అమాయకులను ఇబ్బందులకు గురిచేసేవారు. తక్కువ ధరలకు భూములు కొంటున్న వారిని కబ్జా పేరుతో బెదిరించి బలవంతంగా డబ్బు వసూలు చేసేవారు.

**టీ స్టాల్ నిర్వాహకుడిని బెదిరించి..**

ఫిబ్రవరి 26న సీసీసీ రాయల్ టాకీస్ చౌరస్తాలో హరిహర టీస్టాల్ నడుతున్న రావిపాటి అన్వేష్, అతడి తండ్రి శ్రీనివాస్ వద్ద ఈ ముగ్గురు డబ్బు వసూలుకు వెల్లారు. తాను రిపోర్టర్‌తో పాటు ఆమ్ ఆద్మీ పార్టీలో పనిచేస్తున్నానని నహీం పాషా వారికి చెప్పాడు. పర్మిషన్ లేకుండా, మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్ లేకుండా టీ స్టాల్, కూల్‌డ్రింక్స్ అమ్ముతున్నావంటూ బెదిరించారు. మళ్లీ 27న రాగా, అన్వేష్ లేకపోవడంతో అక్కడే ఉండే రాకేశ్‌కు ఫోన్ నంబర్ ఇచ్చి వెల్లారు. అన్వేష్ ఫోన్ చేయకపోవడంతో ఆ ముగ్గురూ 28న సాయంత్రం టీస్టాల్ వద్దకు వచ్చి ఫోన్ ఎందుకు చేయలేదని బెదిరించారు. డబ్బు లేదని చెప్పినా వినకుండా ఫోన్ లాక్కొని, ఫోన్ పే ద్వారా రూ.10 వేలు పంపించుకున్నారు. ఎవరికైనా చెబితే చంపుతామంటూ బెదిరించారు. వీరు గోదావరిఖనికి వెళ్తున్న క్రమంలో ఆధారాలు లభించవద్దనే ఉద్దేశంతో ఫోన్‌ను గోదావరిలో పడేశారు. బాధితుడు అన్వేష్ సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలించారు. ఆదివారం ఇంటి వద్ద నహీంపాషా, స్నేహితుడు రాజేందర్‌ను అరెస్ట్ చేశారు. నాగేంద్రప్రసాద్ పరారీలో ఉన్నట్లు ఏసీపీ ప్రకాశ్ వివరించారు. ఈ సమావేశంలో మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, ఎస్ఐ సుగుణాకర్ పాల్గొన్నారు.

## 'సీత లేకుంటే రామాయణమే లేదు'

చెన్నూర్ టౌన్, మార్చి 9 : భారతీయ సంస్కృతిలో ప్రతి ఒక్కరూ స్త్రీని గౌరవించాలని రిటైర్డ్ ప్రొఫెసర్, డా మహావాది రాంభావ్ పేర్కొన్నారు. కొమ్మెర రాజేశ్వర్ రావు రచించిన సీతా చరితం, రుక్మిణీ కల్యాణం పుస్తకాలను ముఖ్య అతిథిగా హాజరై, బాల్యమిత్రులతో కలిసి చెన్నూర్‌లోని చోటాహనుమాన్ సేవా నిలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నవరసాలను పండించేవారు, గుండెలు పిండే రచనలు చేసినవారే కవి అని ఉద్ఘాటించారు. రాజేశ్వర్ రావు తన రచనలో ప్రత్యేకతను చాటుకున్నారని, పాఠకులకు సులభంగా అవగతమయ్యేలా చక్కని సరళభాషలో పద్యాలు రాశారని కొనియాడారు. అనంతరం కాకరాల పద్మాకర్, శతావధాని డా.ఎం.పట్వర్ధన్, తహసీల్దార్ పనకంటి రామ్మోహన్ మాట్లాడారు.

**అ'పూర్వ' సమ్మేళనం**

చెన్నూర్ పట్టణంలో 1969లో పదోతరగతి చదివిన విద్యార్థులు అ'పూర్వ' సమ్మేళనాన్ని నిర్వహించారు. స్థానిక చోటాహనుమాన్ సేవా నిలయంలో పాల్గొని నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. మంచీచెడులను మాట్లాడుకొని ఆనందంగా గడిపారు. తమ గురువులు పులి రామన్న, రేవెల్లి రామయ్యతో పాటు పలువురిని సత్కరించారు. బాల్య మిత్రులు మహావాది సుభాష్, కొమ్మెర రాజేశ్వర్ రావు, బీఎస్ రామారావు, బెల్లంకొండ సత్యనారాయణ, డా.శంకర్‌లాల్ లాహోటీ, పనకంటి రమేశ్, కొమ్మెర సత్యనారాయణ, ఎం.పున్నంచంద్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మహావాది రాంభావ్, పద్మాకర్

## ఇష్టపడి చదువాలి

కాగజ్‌నగర్, మార్చి 9 : విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టపడి చదివితే అనుకున్న లక్ష్యం అధిగమిస్తారని మహాత్మ జ్యోతి బాపూలే విద్యాలయం ప్రిన్సిపాల్ మంగ సూచించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్‌పంపు ఏరియాలోని (చిన్నరాస్పల్లి) జ్యతిబాపూలే విద్యాలయంలో శనివారం రాత్రి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణేశ్, రత్నాబాయి, కనకవర్మ, జయప్రద, సంతోష్, ఆనంద్ పాల్గొన్నారు.

# శాంతిఖని ఇక లాంగ్‌వాల్!?

- సింగరేణి యాజమాన్యం ప్రణాళికలు
- మూడునెలల క్రితమే కార్యాచరణ
- రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 6న ప్రజాభిప్రాయ సేకరణ
- ఉన్నతాధికారుల అనుమతులు రాగానే తదుపరి కార్యాచరణ..
- లాంగ్‌వాల్ చేయవద్దని పెర్కపల్లి, పాత బెల్లంపల్లి, గురజాల, ఆకెనపల్లి, లింగాపూర్ గ్రామాల ప్రజల డిమాండ్



శాంతిఖని లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ ఆర్చ్

బెల్లంపల్లి, మార్చి 9 : మందమర్రి ఏరియాలోని శాంతిఖని భూగర్భ షాఫ్ట్ గనిని సింగరేణి యాజమాన్యం లాంగ్ వాల్ ప్రాజెక్ట్‌గా మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నది. అందుకు మూడు నెలల క్రితమే కార్యాచరణ ప్రారంభించింది. సంబంధిత పర్యావరణ అనుమతుల కోసం ఈ నెల 6న రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ కూడా నిర్వహించింది. మంచిర్యాల అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నిజామాబాద్ ప్రాంతీయ కార్యాలయ ఈఈ లక్ష్మణ్ ప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలోని ఆకెనపల్లి గ్రామపంచాయతీ పరిధి శాంతిఖని పాత గని కార్యాలయం ఆవరణలో పకడ్బందీగా చేపట్టింది. ఇక్కడ తీసుకున్న అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదించి, అక్కడి నుంచి అనుమతులు రాగానే తదుపరి కార్యాచరణను యాజమాన్యం ముమ్మరం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నది.

**1954లో గని ప్రారంభం..**

బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి జీపీ పరిధిలో 1954లో శాంతిఖని గని ప్రారంభమైంది. బెల్లంపల్లిలో మార్గన్స్‌పిట్ తర్వాత రెండో గనిగా అంకురార్పణ జరిగింది. మూడేళ్ల తర్వాత 1957లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైంది. నేటికి 71 ఏండ్లు పూర్తిచేసుకున్నది. సుదర్ఘీంగా కొనసాగిన దీని ప్రస్తానం.. కొన్నేండ్ల క్రితం నుంచి నష్టాల బాట పట్టింది. గని పనిస్థలాలు ఎక్కువ దూరంలో ఉండడంతో ఇతర పద్ధతుల ద్వారా ఉత్పత్తికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. గనిలో 500 మీటర్ల లోతున నిల్వలు ఉండడంతో షాఫ్ట్ ద్వారా బొగ్గు వెలికితీత పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగానే కంటిన్యూయెస్ మైనర్ యంత్రాన్ని తీసుకువచ్చారు. రెండేళ్లు ప్రయోగాలు చేసిన



ఆందోళన చేస్తున్న శాంతిఖని గని ప్రభావిత గ్రామాల బాధితులు(ఫైల్)

అధికారులు, గిట్టుబాటు కాకపోవడంతో ఇక్కడి నుంచి తరలించారు. ప్రస్తుతం బోల్డర్ మైనర్ యంత్రం ద్వారా ఉత్పత్తి జరుగుతున్నది. ఈ క్రమంలో యాజమాన్యం లాంగ్ వాల్ ప్రాజెక్ట్ ద్వారా బొగ్గు వెలికితీసేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఈ గని భూగర్భంలో కొన్నేళ్లపాటు తవ్వకాలు జరిపినా తరగని నిక్షేపాలున్నాయి. తాజాగా పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో గని కార్యకలాపాల నిర్వహణ కోసం అధనంగా భూమి సేకరించాల్సిన అవసరం లేదని సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది.

**681.23 హెక్టార్ల ప్రాజెక్టు..**

2006లో ఎంఓఈఎఫ్, సీసీ పర్యావరణ అనుమతి(ఈసీ)ని మంజూరు చేసింది. దాని ప్రకారంగా 681.23 హెక్టార్ల ప్రాజెక్టు ప్రాంతంలో ఏడాదికి 1,167 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో గనిని నిర్వహించాలని ప్రతిపాదించారు. భూగర్భ గనిగా శాంతిఖని లాంగ్‌వాల్ ప్రాజెక్టు చేపడుతారు. ప్రాజెక్టు విస్తీర్ణం 681.23 హెక్టార్లు కాగా, ఇందులో 48.94 హెక్టార్ల అటవీ భూమి, 196.29 హెక్టార్ల అటవీయేతర భూమి ఉన్నది. గని జీవిత కాలం ఎనిమిదేళ్లు కాగా, బోర్డు, ఫిల్లింగ్ మైనింగ్ పద్ధతిలో బొగ్గు వెలికితీస్తారు. గనిలో ఎనిమిది పొరలుగా బొగ్గు ఉన్నట్లు గుర్తించారు. ఎస్ టాప్‌సెక్షన్, ఏ బాటమ్ సెక్షన్ పొరలుగా మైనింగ్ చేస్తారు. జియోలాజికల్ నిల్వలు 48.872 మిలియన్ టన్నులు ఉండగా, వెలికితీయదగిన నిల్వలు 30.93 మిలియన్ టన్నులు, భూగర్భ గని ద్వారా తీయగలిగే నిల్వలు 17.775 మిలియన్ టన్నులు ఉన్నాయి. 2023, మార్చి 31 వరకు 9.01 మిలియన్ టన్నుల బొగ్గు వెలికితీయగా, 2023, ఏప్రిల్ 1నాటికి 8.765 మిలియన్ టన్నుల నిల్వలున్నాయని, బొగ్గు సగటు గ్రేడ్ జీ-9గా గుర్తించారు. ఇందులో లాంగ్‌వాల్, రోడ్ హెడర్, కంటిన్యూయెస్ మైనర్ సాంకేతికతను వినియోగిస్తారు. మూలధన నిధులు రూ.307.840 కోట్లు కాగా, పర్యావరణ పరిరక్షణకు రూ.50లక్షలు (మూల ధన నిధులు), రెవెన్యూ నిధులు ఏడాదికి రూ.39 లక్షలు ఖర్చు చేస్తారు.

**ముంపు గ్రామాల ప్రజల ఆందోళన..**

సింగరేణి అధికారులు మూడు నెలల క్రితం శాంతిఖని గని ఓపెన్‌కాస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం జరిగిన పరిణామాలు, నిరసనలు, వినతుల మేరకు యాజమాన్యం వెనక్కి తగ్గినట్లు తెలుస్తున్నది. ఓపెన్ కాస్టు చేయడం లేదని, శాంతిఖని లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు ప్రకటించింది. అయినా లాంగ్‌వాల్ ప్రాజెక్ట్‌తో భూ గర్భ జలాలు అడుగంటుతాయని అక్కడి రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. గని భూగర్భంలో ప్రస్తుతం 500 మీటర్ల దిగువలో బొగ్గు ఉత్పత్తి జరుగుతున్నది. ఈ గనిని ఓపెన్ కాస్ట్‌గా మార్చే ప్రతిపాదనలవీ లేవని, భూగర్భ భౌగోళిక స్థితిగతుల రీత్యా ఓపెన్ కాస్ట్‌గా మార్చే వీలు ఏ కోశాన లేదని యాజమాన్యం స్పష్టం చేస్తున్నది. భవిష్యత్‌లో గనిలో 500 మీటర్ల నుంచి 700 మీటర్ల లోతు వరకు బొగ్గు వెలికితీతకు అవకాశాలున్నాయి. ఇందుకు శాంతిఖని గనిని లాంగ్‌వాల్ ప్రాజెక్టుగా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రతిపాదిత శాంతిఖని లాంగ్‌వాల్ ప్రాజెక్టు పరిసరాల్లో పలు గ్రామాలు ప్రభావితమయ్యే అవకాశాలూ ఉన్నాయి. తరాల నుంచి ఆయా గ్రామాల ప్రజలు సాగు భూములను నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో తలపెట్టిన పర్యావరణ ప్ర జాభిప్రాయ సేకరణతో సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పెర్కపల్లి, పాత బెల్లంపల్లి, గురజాల, ఆకెనపల్లి, లింగాపూర్ గని ప్రభావిత గ్రామాలుగా ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజల్లో లాంగ్‌వాల్, ఓపెన్‌కాస్టు చేయవద్దనే డిమాండ్ బలంగా వినిపిస్తున్నది. లాంగ్‌వాల్ ప్రాజెక్ట్‌పై నెలకొన్న సందేహాలు, అనుమానాలను నివృత్తి చేసి పునఃధ్రువీకరణ అంశంపై స్పష్టమైన అవగా హన కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, సింగరేణి యాజమాన్యంపై ఉంది. ఇప్పటికే గ్రామాల్లో శాంతిఖని గని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు కాబోతున్నదనే ప్రచారం జోరుగా సాగుతున్నది. ఈ క్రమంలో పర్యావరణ అనుమతి కోసం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడంతో రైతులు ఆందోళన చెందారు.

## న్యాయం కోసం బైఠాయింపు



మహేశ్ అమ్మమ్మ ఇంటి ఎదుట బైఠాయించిన లక్ష్మి

చెన్నూర్ టౌన్, మార్చి 9 : ప్రేమించి మోసం చేశాడని ఓ మహిళ ప్రియుడి అమ్మమ్మ ఇంటి ఎదుట బైఠాయించిన సంఘటన ఆదివారం చెన్నూర్ పట్టణంలో చోటుచేసుకున్నది. బాధితురాలు హైదరాబాద్‌కు చెందిన డెంకం లక్ష్మి మాట్లాడుతూ.. కోటపల్లి మండలం రాపన్‌పల్లి గ్రామానికి చెందిన మల్లోజు మహేశ్ తనను పెళ్లి చేసుకొని మోసం చేశాడని ఆరోపించింది. కొన్నేళ్లుగా మహేశ్‌తో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నామని తెలిపింది. ఉద్యోగం పోవడంతో ఇంటికి వెళ్లి వస్తానని చెప్పిన మహేశ్, రెండు నెలలుగా రావడంలేని పేర్కొన్నది. మహేశ్ మరో పెళ్లి చేసుకునేందుకు చూస్తున్నట్లు తనకు తెలవడంతో ఆరాతీసేందుకు వచ్చానని తెలిపింది. మహేశ్ అందుబాటులో లేకపోవడంతో ఆయన అమ్మమ్మ ఇంటి ఎదుట బైఠాయించినట్లు చెప్పింది. న్యాయం చేయాలని భీష్మించింది. మహిళను కుల పెద్దల సమక్షంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మంచిర్యాలలో వ్యభిచారం గుట్టురట్టు

మంచిర్యాల అర్బన్, మార్చి 9 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ ఏరియాలో ఆదివారం పోలీసులు వ్యభిచారం గుట్టురట్టు చేశారు. పక్కా సమాచారం మేరకు నిఘా ఏర్పాటు చేసి, దాడులు చేశారు. పట్టణ ఎస్ఐ ముత్తె ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్ నగర్‌కు చెందిన ముత్తినేని మాదవి ఇంటిని వైష్ణవి అనే మహిళలకు వ్యభిచారం నిర్వహించేందుకు ఇచ్చింది. వైష్ణవి ఇతర ప్రాంతాల నుంచి మహిళలను పిలిపించి, కొంతకాలంగా గుట్టుగా దందా కొనసాగిస్తున్నది. వీటుల నుంచి తీసుకున్న డబ్బుల నుంచి రూ.వెయ్యి మాదవికి ఇచ్చి, మిగిలిన దాంట్లో కొంత బాధిత మహిళలకు అప్పజెప్పి, వైష్ణవి తీసుకునేది. ఆదివారం పోలీసులకు అందిన సమాచారం మేరకు ఆకస్మిక దాడిచేయగా, సీసీసీ నస్పూర్ తీగల్‌పాహడ్‌కు చెందిన విటుడు సిరికొండ శ్రీనివాస్ పట్టుబడ్డాడు. ఈ మేరకు మాదవి, శ్రీనివాస్‌ను, బాధిత మహిళలను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్లు, మరో వైష్ణవి పరారీలో ఉన్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

## విద్యుదాఘాతంతో మహిళ మృతి

లక్షెట్టిపేట, మార్చి 9 : లక్షెట్టిపే మున్సిపాలిటీ పరిధి ఇటిక్యాలలో ఆదివారం విద్యుదాఘాతంతో గంధం తిరుమల (42) మృతి చెందినట్లు ఎస్ఐ సతీశ్ తెలిపారు. ఆదివారం ఉదయం తిరుమల స్నానం కోసమని వేడినీళ్లు పెట్టుకునేందుకు బకెట్‌లో హీటర్ పెడుతుండగా, ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైంది. తిరుమలకు భర్త తిరుపతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లి భాగ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## కామాంధుడిని కఠినంగా శిక్షించాలి

కాగజ్‌నగర్, మార్చి 9 : జగిత్యాల జిల్లా రాయికల్‌లో ఆశ కార్యకర్తపై అత్యాచారానికి పాల్పడ్డ నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ, అత్యాచారం కేసు నమోదు చేయాలని సీఐటీయూ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని వివిధ వార్డుల నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా రాజీవ్ గాంధీ చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. ఆశ కార్యకర్త తన విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా, ఓ కామాంధుడు దౌర్జన్యం చేసి, బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడని మండిపడ్డారు. ఘటన జరిగి పది రోజులవుతున్నా నిందితుడిని పోలీసులు అరెస్టు చేయలేదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించి, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్కే న్యూటెక్ గని లక్ష్యం పూర్తి

శ్రీరాంపూర్, మార్చి 9 : శ్రీరాంపూర్ ఏరి యా ఆర్కే న్యూటెక్ గని తన వార్షిక ఉత్పత్తి లక్ష్యం 18 రోజుల ముందుగానే సాధించింది. ఈ మేరకు గని మేనేజర్ స్వామిరాజు ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 1.60 లక్షల టన్నులు లక్ష్యంగా పెట్టగా, ఆదివారం నాటికి 1,60,192 టన్నులు (100 శాతం) సాధించిందని తెలిపారు. ఈ నెలాఖరువరకు 107 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్పాదకత 1.28 శాతంగా నమోదు చేసుకున్నట్లు వివరించారు. ఆర్కే న్యూటెక్ గని వరుసగా మూడో సంవత్సరం 100 శాతం ఉత్పత్తి లక్ష్యాలు అధిగమించినట్లు, 2022-23లో 112 శాతం, 2023-24లో 100.53 శాతం, ఈ ఏడాది 107 సాధించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా అందరినీ అభినందించారు.

## మహిళా దినోత్సవ వేడుకలు

రామకృష్ణాపూర్, మార్చి 9 : రామకృష్ణాపూర్ పట్టణంలోని సీఎస్ఐ సెయింట్ పీటర్స్ చర్చిలో ఆదివారం పాస్టర్ రెవ జాషువా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. డొలకల డేవిడ్‌ఎస్తేరు కలెక్టర్ కుమార్ దీపక్ చేతుల మీదుగా ఉత్తమ మహిళా అవార్డు అందుకోగా, ఆమెను సన్మానించారు. ఉమెన్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ కళావతి, సెక్రటరీ ప్రేమలత, కమిటీ సభ్యులు శరత్ బాబు, డొలకల డేవిడ్, దేవానందం తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావరసరాల పంపిణీ

కాగజ్‌నగర్, మార్చి 9 : కాగజ్‌నగర్ పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో దారుల్ అన్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రంజాన్ రేషన్ కిట్లు పంపిణీ చేశారు. ఇంటింటా సర్వే చేసి, పేదలు, వితంతువులు, కూలీలు, వికలాంగులకు 115 మంది మహిళలకు నిత్యావరాలు అందజేశారు. అలాగే 115 మందికీ రూ.500 చొప్పున ఇచ్చామని వారు తెలిపారు. దారుల్ అన్సార్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ముఫాహం అహ్మద్, జాయింట్ సెక్రటరీ హాఫీజ్ రియాజ్, కోశాధికారి రహీం మల్నాస్, అబ్దుల్ షకీర్, ట్రస్ట్ కో సభ్యులు అబ్దుల్ ముఖీమ్, ఖాజా సలావుద్దీన్ తదతరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం

దండేపల్లి, మార్చి 9 : దండేపల్లి మండలం కాసిపేట గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు శాతరాజి గంగన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు రూ.10 వేలను ఆదివారం కుటుంబ సభ్యులకు అందించారు. అలాగే మాజీ సర్పంచ్ అంబడిపెల్లి రవి రూ.2 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు కల్లెం రాజన్న, అప్పాల సునీల్, బక్కశెట్టి వెంకటేశ్, లక్కాకుల వెంకటేశ్, మాదాసు వెంకటేశ్, మాజీ సర్పంచ్ మైదం యశోధగంగారెడ్డి, నాయకులు మల్లేశ్, శంకరయ్య, అహ్మద్, రామన్న, సత్తన్న, లింగయ్య తదితరులున్నారు.